# నమస్తే తెలంగాణ
## ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ గురువారం 13 ఫిబ్రవరి 2025 | ADILABAD NIRMAL




దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

## సంక్షేమానికి బీఆర్ఎస్ కార్యక్రమాలు చేపట్టింది

**మాజీ మంత్రి జోగు రామన్న**

ఎదులాపురం, ఫిబ్రవరి 12 : మైనార్టీల సంక్షేమానికి గత బీఆర్ఎస్ అనేక కార్యక్రమాలను చేపట్టిందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. గతంలో బీఆర్ఎస్ మైనార్టీల కోసం విడుదల చేసిన రూ.17 కోట్లలో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న జమ మసీదు పనులను బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. పనుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ హయాంలో మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి రూ.17 కోట్లను అప్పటి సీఎం కేసీఆర్ విడుదల చేశారన్నారు. ఆ నిధుల నుంచి 200 ఏండ్ల పురాతన జమ మసీదు నిర్మాణానికి కేటాయించడం జరిగిందన్నారు. పనులు కూడా దాదాపు పూర్తి కావస్తున్నాయన్నారు. రూ.17 కోట్లలో రూ.12 కోట్లు ఖర్చు చేశామని మరో రూ.3 కోట్లకు సంబంధించి కలెక్టర్‌కు ప్రొసిడింగ్ వచ్చాయన్నారు. హాజ్ హౌజ్, సవారీ బంగ్లా, చమన్‌వాలే బాబా పనులు కొనసాగుతున్నాయని, వాటిని కూడా పరిశీలించి త్వరతగతిన పూర్తి చేసేలా కృషి చేస్తామన్నారు. మిగిలిన నిధుల కోసం ప్రభుత్వానికి విన్నవించి విడుదలయ్యే చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు ఇర్షద్ హుస్సేన్, బాబు బాయ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, నాయకులు పవన్ నాయక్, సయ్యద్ సాజిదుద్దీన్, ఫెరోజ్, అయ్యూబ్ పాల్గొన్నారు.



నేరడిగొండలో వృక్షార్చన పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలి

**బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్**

నేరడిగొండ, ఫిబ్రవరి 12 : కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రతిఒక్కరూ మూడు మొక్కలు నాటాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కేసీఆర్ పుట్టిన రోజున నిర్వహించే వృక్షార్చన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 17వ తేదీన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలన్నారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త, మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపెల్లి సంతోష్‌కుమార్ నిర్వహించే వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సెల్ఫీ తీసుకోవాలన్నారు. మొక్కలు నాటి వాటిని రక్షించే బాధ్యత తీసుకోవడమే కేసీఆర్‌కు మనం ఇచ్చే పుట్టిన రోజు కానుక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాడ్గె సుభాష్, ధీరజ్, తుల సీరాం, స్వప్నిల్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

ఇచ్చోడ(సిరికొండ), ఫిబ్రవరి 12 : సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం వివిధ మండలాల నుంచి ప్రజలు ఎమ్మెల్యేను కలిసి సమస్యలను విన్నవించారు. సిరికొండ మండలంలోని గిరిజన గ్రామమైన రాంజీగూడ గిరిజనులు గ్రామంలో నెలకున్న సమస్యలను వివరించారు. అలాగే తలమడుగు మండలంలోని సుంకిడి మాల సంఘం సభ్యులు గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని కోరారు. నేరడిగొండ మండలంలోని ఆరేపల్లి గ్రామస్తులు గ్రామంలో పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.





# రైతు భరోసా రాకపాయె..

**మూడెకరాలున్న వారికి జమ అంటున్న సర్కారు**

- రెండెకరాల్లోపు ఉన్నా రాలేదంటున్న కొందరు రైతులు
- బ్లాక్‌లో పడిపోయిందేమో అంటూ అన్నదాతల ఆందోళన
- గతంలో సమయానికి పెట్టుబడి సాయం..
- ఇప్పుడేమో అలా లేదంటూ వాపోతున్న కర్షకులు

### రైతు భరోసా పడలేదు..



*జైపూర్, ఫిబ్రవరి 12: నాపేరు మాదాసు శంకర్ మాది జైపూర్ మండలంలోని ఇందారం గ్రామం, నాకు గ్రామ శివారులో రెండెకరాల భూమి ఉంది. ఏడాది నుంచి రైతు భరోసా రాలేదు. మూడెకరాలు ఉన్నవారికి రైతుభరోసా వేస్తామని ప్రభుత్వం అనగానే ఆశతో చూస్తున్నాం. గత ప్రభుత్వంలో ఈ విధంగా లేకుండే రెగ్యులర్‌గా రైతు బంధు వచ్చేది. ఇప్పుడు మాత్రం సంవత్సరం నుంచి రైతు భరోసా డబ్బులు అకౌంట్‌లో పడలేదు. కొంతమందికే రైతు భరోసా పడింది మాకు పడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు రైతు భరోసా పడలేదు. కొంత మందికేమో సెల్‌కు మెస్సేజ్‌లు వచ్చినయ్ అకౌంట్లలో మాత్రం డబ్బులు జమ కాలేదు.*

మంచిర్యాల, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గడిచిన ఏడాది పాలనలో రైతన్నలకు ఒరిగిందేం లేదు. బీఆర్ఎస్ హయాంలో పదేళ్లు సమయానికి నీళ్లు, పంట పెట్టుబడి సాయం, మద్దతు ధరకు కొనుగోళ్లలో కళకళలాడిన అన్నదాతలు.. గడిచిన ఏడాదిగా ఎన్నో అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇది తెలంగాణ రైతులు ఎవరిని కదిలించినా చెప్తున్న మాట. రుణమాఫీ అని చెప్పి కొందరికే చేశారు. రానోళ్లకు రాకుండానే పోయింది. పంట పెట్టుబడి సాయం రూ.15 వేలు అని చెప్పి చివరకు రూ.12 వేలు ఇస్తామంటున్నరు. గతంలో తొలి రోజు ఎకరం భూమి ఉన్న రైతుకు, రెండో రోజు రెండు ఎకరాలలోపు భూమి ఉన్న రైతుకు, మూడో రోజు మూడు ఎకరాల లోపు ఉన్న రైతుకు ఇలా ఎన్ని ఎకరాలు ఉన్నా రైతులందరికీ పంట పెట్టుబడి సాయం అందేది. ఇప్పుడు జనవరి 26న మొదలుపెడితే ఫిబ్రవరి 10వ తేదీ దాకా రెండు ఎకరాలున్న రైతులకు కూడా పూర్తిస్థాయిలో పెట్టుబడి సాయం రాలేదు. ఫిబ్రవరి 12వ తేదీ నుంచి మూడెకరాలు ఉన్న రైతులకు రైతు భరోసా వేయడం మొదలుపెట్టామని సర్కారు చెప్తున్నా.. రెండు ఎకరాలలోపు ఉన్న చాలా మందికి భరోసా పడలేదని రైతులు వాపోతున్నారు.

### భూములు గల్లంతు.. లెక్కల్లో తేడాలు..

రైతు భరోసా రూ.15 వేలు కాదు.. రూ.12 వేలు ఇస్తామంటూ మాట మార్చి మోసం చేసింది సర్కారు. పోనీ ఎంతో కొంత వస్తుందనుకుంటే సాగులో ఉన్న భూములకే అంటూ, సర్వే అంటూ ప్రకటన చేసింది. ఎట్లతే ఏమున్నది మాకు రైతు భరోసా వస్తే చాలనుకున్నరు రైతులు. ఇప్పుడు రైతు భరోసా వెబ్‌సైట్ నుంచి రైతుల భూముల వివరాలు గల్లంతయ్యాయి. కొందరు రైతుల భూముల వివరాలు పూర్తిస్థాయిలో మాయమైపోగా, మరికొందరు రైతులు భూముల వివరాలు సగమే ఉన్నాయి. నాలుగు ఎకరాలు ఉన్న రైతుకు రెండు ఎకరాలే నమోదైంది. ఇలా జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు ప్రధాన పత్రికలు, సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండెకరాలలోపు భూమి ఉండి రైతు భరోసా పడని వాళ్లు.. మా భూములు బ్లాక్ లిస్టులో పెట్టారా? ఏమో అని కంగారు పడుతున్నారు. అధికారుల దగ్గరికి వెళ్లి కలిసేందుకు సిద్ధం అవుతున్నారు.

### రుణమాఫీ కాలే.. రైతు భరోసా రాలే..



*చింతలమానేపల్లి, ఫిబ్రవరి 12 : నాకు ఎకరం పట్టా భూమి ఉంది. మొదటి విడుతలో రైతు భరోసా డబ్బులు రాలేదు. రెండో విడుతలో కూడా ఇప్పటి వరకు పడలేదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో గృహ జ్యోతి, రైతు రుణమాఫీ కూడా నాకు రాలేదు. మా కుటుంబ సభ్యులకు ఏ ఒక్కరికి రైతు భరోసా రాలేదు. రుణమాఫీ కాలేదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం హామీలకే పరిమితమైంది. గత కేసీఆర్ పాలన బాగుండేది. పథకాలు సరిగ్గా అమలయ్యేవి. రైతు బంధు డబ్బులు సమయానికి అకౌంట్‌లో పడేవి.*

**- నికోడే సందీప్, డబ్బా గ్రామం, చింతలమానేపల్లి**

# కందుల కొనుగోళ్లపై సీలింగ్

- ఎకరాకు 3.30 క్వింటాళ్ల సేకరణ
- సర్కారు నిర్ణయంతో రైతుల్లో ఆందోళన
- ఎకరాకు ఆరు క్వింటాళ్ల దిగుబడి

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో విక్రయానికి వచ్చిన కందులు



ఆదిలాబాద్, ఫిబ్రవరి 12(నమస్తే తెలంగాణ) : రైతులు వానకాలంలో సాగు చేసిన కందుల కొనుగోళ్లపై ప్రభుత్వం సీలింగ్ విధించడంతో రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకున్నది. జిల్లాలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోళ్లు జరుగుతుండగా.. ప్రభుత్వ సూచనల మేరకు ఎకరాకు 3.30 క్వింటాళ్లు మాత్రమే సేకరిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది వానకాలంలో 72 వేల ఎకరాల్లో రైతులు సాగు చేయగా పదిహేను రోజుల నుంచి దిగుబడులు ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది కందులు క్వింటాలుకు రూ. 7,550 మద్దతు ధర ప్రకటించగా.. జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలతోపాటు వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరాకు 6 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పంటను విక్రయించడానికి మార్కెట్ వస్తున్న రైతులు ప్రభుత్వ నిర్ణయం ఆందోళనకు గురి చేస్తున్నది.

**నష్టపోవాల్సిన పరిస్థితి**

ప్రభుత్వం రైతులు పండించిన కందులు ఎకరాకు 3.30 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయాలని సూచించడంతో అన్నదాతలు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకున్నది. ఎకరాకు కనీసం 6 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని వ్యవసాయ శాఖ అధికారుల నివేదికలు చెబుతుండగా ప్రభుత్వం దిగుబడులను పరిగణలోకి తీసుకోకుండా నామమాత్రంగా కొనుగోళ్లు జరుపుతుందని రైతు సంఘాల నాయకులు అంటున్నారు. ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ.7200తో కొనుగోలు చేస్తున్నారు. ప్రైవేటులో పంటను విక్రయించిన రైతులు క్వింటాలుకు రూ.350 చొప్పున నష్టపోవాల్సి వస్తుంది. రైతులు పండించిన పంట మొత్తాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం షరతులు విధించడం సరికాదని రైతులు అంటున్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకుని కందుల కొనుగోళ్లు జరపాలని కోరుతున్నారు. రెండురోజుల కిందట కలెక్టర్‌తో జరిగిన సమావేశంలో ఎకరాకు 6 క్వింటాళ్లను సేకరించడానికి ప్రభుత్వానికి లేఖ రాసినట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు ప్రవీణ్ రెడ్డి తెలిపారు. రెండు, మూడు రోజుల్లో ఆదేశాలు వచ్చే అవకాశాలున్నాయన్నారు.

### 6 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి



*ఈ ఏడాది కంది దిగుబడులు బాగా ఉన్నాయి. ఎకరాకు కనీసం 6 క్వింటాళ్లు, నీళ్లు ఉన్న రైతులకు 10 క్వింటాళ్ల దిగుబడులు వస్తున్నాయి. ప్రభుత్వం ఎకరానికి 3.30 క్వింటాళ్లు మాత్రమే తీసుకోవాలని సూచించడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం దేని ఆధారంగా కొనుగోళ్లపై నిర్ణయం తీసుకుందో తెలియడం లేదు. సర్కారు నిర్ణయంతో రైతులు దళారులకు పంటను విక్రయించాల్సి వస్తుంది. వాస్తవ పరిస్థితులను గమనించి పంట కొనుగోళ్లలో రైతులు నష్టపోకుండా మొత్తం పంటను కొనుగోలు చేయాలి.* **- కుమ్ర రాజు, రైతు, చింతగూడ, ఆదిలాబాద్ రూరల్ మండలం**

## కాంగ్రెస్ పాలనలోనే విద్యార్థినులపై అఘాయిత్యాలు

**సారంగాపూర్‌లో ధర్నా**



సారంగాపూర్‌లో ధర్నా చేస్తున్న నాయకులు

సారంగాపూర్, ఫిబ్రవరి 12 : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే విద్యార్థినులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు కాల్వ నరేశ్ అన్నారు. బుధవారం మండలంలోని స్వర్ణ గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదుతున్న విద్యార్థినిని కిడ్నాప్ చేసి అత్యాచారం చేసినందుకు బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన సారంగాపూర్ బస్టాండ్‌లో ధర్నా చేపట్టారు. బీజేపీ నాయకులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యం మూలంగానే మైనర్ విద్యార్థినిని కిడ్నాప్ చేసి ఓ యువకుడు అత్యాచారం చేశాడని అన్నారు. బాలికపై ఆఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా డిమాండ్ చేశారు. బీజేపీ నాయకుల ధర్నా చేస్తున్నట్లు తెలువడంతో సీఐ కృష్ణ, ఎస్ఐ సాయికుమార్ పోలీసులు అక్కడి చేరుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపిస్తామని పోలీసులు తెలుపడంతో ధర్నా విరమించారు.

## డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సరఫరా

**సమస్యల పరిష్కారానికి 1912 నంబర్‌కు డయల్ చేయండి**

**విద్యుత్ శాఖ సీఈ జయవంత్‌రావు చౌహాన్**

ఆదిలాబాద్, ఫిబ్రవరి 12(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు ఎండాకాలంలో మెరుగైన సేవలు అందించడానికి చర్యలు తీసుకున్నట్లు ఆదిలాబాద్ జిల్లా విద్యుత్ శాఖ నోడల్ అధికారి, చీఫ్ ఇంజినీర్(కన్‌స్ట్రక్షన్) తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 1.902 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతుండగా.. 2.05 మిలియన్ యూనిట్ల సరఫరా జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశాలు ఉండడంతో వినియోగదారులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వచ్చే పక్షం రోజుల్లో వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గుతుందన్నారు. జిల్లాలో విద్యుత్ సరఫరా మెరుగుపర్చడంలో భాగంగా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 20, సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 85 ఏర్పాటు చేశామని, మరో 100 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేసినట్లు చెప్పారు. జిల్లాలో ఆరు కొత్తగా 33 కేవీ స్టాండ్‌బై లైన్‌లు మంజూరు అయ్యాయని, నాలుగు లైన్ల పనులు జరుగుతుండగా, రెండు లైన్‌లు టెండర్ దశలో ఉన్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 1800 వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేశామన్నారు. వచ్చే వానకాలం నాటికి మరో 1200 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి సమస్యలు ఉన్న 1912 నంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలని, పరిష్కారం కోసం అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.



మాట్లాడుతున్న జయవంత్‌రావు చౌహాన్

## ఆదిలాబాద్ మార్కెట్ కార్యదర్శి సస్పెన్షన్

**పత్తి కొనుగోళ్లలో అక్రమాలే కారణం**

ఆదిలాబాద్, ఫిబ్రవరి 12(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ మార్కెట్ యార్డు కార్యదర్శి మధూకర్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి ఉత్తర్వులు జారీ చేశారు. కౌలు రైతులకు సంబంధించి పత్తి కొనుగోళ్ల విషయంలో ధ్రువీకరణ పత్రాల జారీలో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన అధికారులు కార్యదర్శిని సస్పెండ్ చేశారు. పత్తి పంటను సాగు చేసిన రైతులు వ్యవసాయ శాఖ అధికారుల వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలి. ఈ వివరాలను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. వీటి ఆధారంగా కొనుగోళ్లు జరుగుతాయి. కౌలు రైతులు సాగు చేసిన పంటను సీసీఐకి విక్రయించడానికి వీలుగా వ్యవసాయ విస్తరణ అధికారులు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. వీటి ఆధారంగా మార్కెటింగ్ శాఖ కార్యదర్శులు టెంపరరీ రిజిస్ట్రేషన్ జారీ చేస్తే సీసీఐ కౌలు రైతుల పంటను కొనుగోలు చేస్తుంది. ఈ పత్రాల జారీ విషయంలో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన అధికారులు ఆదిలాబాద్ మార్కెటింగ్ శాఖ కార్యదర్శి మధూకర్‌ను సస్పెండ్ చేశారు.

